క్లుప్తంగా

జగన్‌ను కలసిన పాపారాయుడు



కర్రి పాపారాయుడితో మాట్లాడుతున్న మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి

మండపేట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు బుధవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండపేట నియోజకవర్గంలోని పరిణామాలపై జగన్‌తో చర్చించారు. ధైర్యంగా ఉండాలని పార్టీ పటిష్టతకు పాటుపడాలని అధినేత జగన్ తనకు సూచించినట్టు పాపారాయుడు తెలిపారు. పాపారాయుడు తన మనువడు జూనియర్ పాపారాయుడిని వెంట తీసుకు వెళ్లడంతో జగన్ ఆ బాబుని ఒడిలోకి తీసుకుని ఆశీర్వచనాలు అందజేశారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట: బ్రాహ్మణుల సంక్షేమానికి తాను కృషి చేస్తానని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హామీ ఇచ్చారు. పట్టణంలోని బ్రాహ్మణులు బుధవారం టీడీపీ కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యే వేగుళ్లను మర్యాద పూర్వకంగా కలశారు. కొత్త ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను దుశ్శాలువాలతో సత్కరించారు. వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించారు. తన గెలుపులో భాగస్వాములైన బ్రాహ్మణులకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల ధన్యవాదాలు తెలిపారు. అవసరాల వీర్రాజు, కేసరి విద్యాసాగర్, దంటు సూర్యనారాయణ, గరిమెళ్ల గోపాలకృష్ణ తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

ఎంపీడీవోల ఆధ్వర్యంలో గ్రామ సభలు



అచ్యుతాపురం గ్రామంలో ప్రణాళికను వివరిస్తున్న కార్యదర్శి చినబాబు

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీఓ కొండలరావు పర్యవేక్షణలో పంచాయతీల కార్యదర్శుల ఆధ్వర్యంలో గ్రామసభలను నిర్వహించి పలు సమస్యలపై చర్చించారు. సర్పంచ్‌ల అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభల్లో వర్షాకాలం నేపథ్యంలో పారిశుద్ధ్య పరిరక్షణకు వార్డు సభ్యులు చొరవతో కృషి చేయాలని కార్యదర్శులు కోరారు. డ్రైనేజీల్లో నీటిపారుదల సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వ శాఖల సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని ఎంపీడీఓ ఆదేశించారు.

ఘనంగా ప్రపంచ మెకానిక్ దినోత్సవం



ద్రాక్షారామలో ప్రపంచ మెకానిక్ దినోత్సవం నిర్వహిస్తున్న మెకానిక్‌లు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో శ్రీశ్రీశ్రీ భీమేశ్వరస్వామి మోటార్ సైకిల్ మెకానిక్ వర్కర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ మెకానిక్ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. టూ వీలర్ సృష్టికర్త గాట్లీజ్ డైమ్లర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. అనంతరం మెకానిక్‌ల ఐక్యత వర్థిల్లాలి అంటూ నినాదాలతో ద్రాక్షారామ నుంచి రామచంద్రపురం పట్టణం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు మద్దూరి సత్యప్రసాద్, అధ్యక్ష, కార్యదర్శులు పిల్లి కృష్ణ, పిల్లి భీమన్న, ఉపాధ్యక్షుడు దడాల రవికుమార్, కోశాధికారి అనిశెట్టి ముత్యాలరావు, సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం

రావులపాలెం: బొబ్బర్లంక– ముక్తేశ్వరం బ్యాంక్ కెనాల్‌లో స్థానిక సిద్ధార్థ స్కూల్ సమీపంలో ఒక గుర్తుతెలియని మృతదేహాన్ని బుధవారం స్థానికులు గుర్తించారు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగిన మగ వ్యక్తి మృతదేహంగా పోలీసులు గుర్తించారు. ప్రధాన పంట కాలువలో వెదురు బొంగులకు చిక్కుకొని ఉండటంతో స్థానిక వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుని వివరాలు తెలిసిన వారు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

మినీ గోకులం బిల్లులు చెల్లించరూ?

- టీడీపీ హయాంలో పెండింగ్‌లో బిల్లులు
- సీఎం జగన్ పాలనలో కొంతమేర చెల్లింపులు
- ప్రస్తుత ప్రభుత్వం పూర్తి బిల్లు చెల్లించాలని రైతులు విజ్ఞప్తి



అంగరలో సొంత నిధులతో పాడి రైతు నిర్మించుకున్న మినీ గోకులం



కపిలేశ్వరపురంలో మినీ గోకులాల బిల్లుల చెల్లింపుపై సమీక్షిస్తున్న డీడీ శ్రీనివాసులు (ఫైల్)

కపిలేశ్వరపురం: పశుపోషణలో పాడి రైతుల సౌలభ్యం కోసం 2018 నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో మినీ గోకులాల నిర్మాణ పథకాన్ని అమలు చేసింది. పశు సంవర్ధకశాఖ అధికారుల పర్యవేక్షణలో క్షేత్రస్థాయిలో రైతులు సొంత పెట్టుబడితో గోకులం షెడ్లు నిర్మించుకున్నారు. అప్పటి ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. దీంతో పాడి రైతులు నిండా మునిగారు. అధికారుల చుట్టూ తిరిగి తిరిగి ఓపిక నశించి మిన్నకున్నారు. తర్వాత కాలంలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బకాయిల్లో కొంతమేర చెల్లించడంతో రైతులకు ఉపశమనం కలిగింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వానికి మినీ గోకులాల బకాయిలను తీర్చాల్సిన బాధ్యత ఉందంటూ బాధిత పాడి రైతులు కోరుతున్నారు.

పథకం నిర్వహణ ఇలా...

పశువులకు ఆరోగ్య వసతి ఏర్పాటు లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం సమన్వయంతో మినీ గోకులాల నిర్మాణ పథకాన్ని రూపొందించింది. 2018 సెప్టెంబర్‌లో మినీ గోకులాల పథకానికి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. రెండు పశువుల వసతి సామర్థ్యం గల షెడ్డు నిర్మాణం యూనిట్ రూ.లక్ష, నాలుగు పశువులుంటే రూ.1,50,000, ఆరు పశువులున్న షెడ్డుకు రూ.1,80,000 యూనిట్ ధరగా నిర్ణయించారు. 70 శాతం కేంద్రం, 20 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 10 శాతం లబ్ధిదారుడి వాటాతో కూడిన ఈ పథకం అమలులో రైతులను ప్రోత్సహించారు. ముందస్తుగా లబ్ధిదారుడు తన 10 శాతం వాటా సొమ్ముగా ఆయా యూనిట్ల ధరలను బట్టి రూ.10 వేలు, రూ.15 వేలు, రూ.18 వేల చొప్పున ప్రభుత్వానికి చెల్లించి నిర్మాణ పనులను చేపట్టారు. ముందస్తు సాయం సొమ్మును చెల్లించక పోవడంతో పది శాతం రైతు వాటాతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించాల్సిన పెట్టుబడిని కూడా రైతులే భరించాల్సి వచ్చింది. రూ.1,80,000 వెచ్చించి రైతులు గోకులం షెడ్డు నిర్మించుకున్నారు. బిల్లులు ఇచ్చే పరిస్థితి టీడీపీ ప్రభుత్వం లేదని గ్రహించిన కొందరు రైతులు తమ గోకులాల నిర్మాణాలను అసంపూర్తిగా నిలిపివేశారు. మరికొందరు సొంత సొమ్ముతో నిర్మాణాలను పూర్తి చేసుకున్నారు. అప్పటి ప్రభుత్వ కాలం ముగిసినప్పటికీ బిల్లులు చెల్లింపు జరగలేదు.

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

2018 నవంబర్‌లో మండపేట మండలంలో 359, కపిలేశ్వరపురం మండలంలో 103 మినీ గోకులాలు మంజూరయ్యాయి. రైతులు నిర్మాణాలను పూర్తి చేసుకున్నప్పటికీ అప్పటి ప్రభుత్వం బిల్లులను చెల్లించలేదు. రైతులు పదే పదే అధికారులకు విజ్ఞప్తులు చేశారు. కపిలేశ్వరపురం మండలంలోని 103 మంది లబ్ధిదారులకు రూ.1,23,02,891, ఆలమూరు మండలంలో 46 మినీ గోకులాలకు గానూ రూ.51,39,329 చెల్లించాల్సి ఉందంటూ అప్పట్లో సమీక్ష సమావేశంలో అధికారులు వెల్లడించారు. సమస్యపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వ కాలంలో స్పందించిన పశు సంవర్ధక శాఖ రాజమహేంద్రవరం డీడీ కె.శ్రీనివాసులు అప్పట్లో కపిలేశ్వరపురం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాలకు చెందిన సంబంధిత శాఖల ఉద్యోగులతో సమావేశం కూడా నిర్వహించారు. అసిస్టెంట్ సర్జన్లు, అసిస్టెంట్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది ద్వారా సమాచారాన్ని రాబట్టి ఉన్నతాధికారులకు నివేదించారు. ఆ కృషి మేరకు కొంతమేర బిల్లుల చెల్లింపులు జరిగాయి.

పూర్తి బిల్లు చెల్లించాలి



2018లో ప్రభుత్వ హయాంలో రూ.1,80,000 విభాగంలో మినీ గోకులం నిర్మించాను. ముందుగా రూ.18 వేలు చెల్లించాను. నిర్మాణం పూర్తైనప్పటికీ అప్పటి ప్రభుత్వం బిల్లు చెల్లించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మా ఆవేదనను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి కృషి ఫలితంగా 2021 ఆగస్టులో రూ.83 వేలు జమ చేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున పూర్తి బిల్లులను చెల్లించాలని కోరుతున్నాను.

–యానాల వీర్రాఘవులు, లబ్ధిదారుడు, అంగర

ఉచిత దంత వైద్య సేవలు



ఉచిత వైద్య శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ క్రాంతికుమార్

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో శ్రీ భీమేశ్వర దంత వైద్య శాల ఆధ్వర్యంలో బుధవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. దంత వైద్యులు డాక్టర్ బచ్చు క్రాంతికుమార్, డాక్టర్ సీహెచ్ గీతా సువర్ణ, డాక్టర్ రాజేశ్‌నాయుడు 150 మందికి దంత వైద్య సేవలు అందించారు. ముందుగా దంత సమస్యలు రావడానికి గల కారణాలు, నివారణ చర్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం అత్యాధునిక డెంటల్ రోబోట్ పరికరం ద్వారా దంత పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన వైద్య సేవలను వారివారి మొబైల్ ఫోన్‌లకు రిపోర్టుల రూపంలో అందజేశారు. వైద్య పరీక్షల అనంతరం రోగులకు ఉచితంగా మందులు, టూత్ పేస్టులు, మౌత్ వాష్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థల బంద్



మండపేటలో బంద్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘ నేతలు

మండపేట: దేశ వ్యాప్తంగా గురువారం విద్యాసంస్థల బంద్‌కు పిలుపు ఇచ్చామని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ అన్నారు. మండపేటలో కూడా గురువారం విద్యాసంస్థలను మూసివేసి బంద్ విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలసి సిద్ధూ బంద్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం సిద్ధు, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) జాతీయ స్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందన్నారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీ స్కామ్‌పై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకుడు వి. కార్తీక్, విద్యార్థులు కాజా బాబు, ఎం. సత్యకుమార్, అబ్బాస్, సుజన, శ్రీదేవి, నవ్య, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

కపిలేశ్వరపురం: జాతీయ స్థాయి పోటీ పరీక్షలను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) సంస్థను రద్దు చేయాలన్న ప్రధాన డిమాండ్‌పై గురువారం చేపట్టదలచిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు కోరారు. మండలంలోని అంగరలో బుధవారం సంఘం సమ్మె సన్నాహక సమావేశం నిర్వహించారు.

ప్లాస్టిక్ భూతంతో మానవాళికి ముప్పు



విశ్వేశ్వరాయపురలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురం వివేకానంద ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) మలికిపురం శాఖ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ పాఠశాల కరెస్పాండెంట్, జేవీవీ మండల అధ్యక్షుడు పీవీవీ వరప్రసాద్ మాట్లాడుతూ నేటి కాలంలో ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగిందని తినటానికి, తాగడానికి, బజారు నుంచి సరుకులు తెచ్చుకోవడానికి ఇలా ప్రతి పనికి ప్లాస్టిక్ బ్యాగులను వినియోగిస్తున్నారన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పారిశుద్ధ్య సమస్యలతో పాటు అనేక రకాల అనారోగ్యాలు కలుగుతున్నాయని అన్నారు. తాగడానికి, తినడానికి స్టీల్ సామాన్లను వాడుకోవాలన్నారు. అలాగే మానవతా మూర్తులు గ్రూప్ అడ్మిన్ బోనం రాజు మాట్లాడుతూ ప్లాస్టిక్ బహుమతుల స్థానంలో మొక్కలు, క్లాత్ వస్తువులను అందజేయాలని, పర్యావరణాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో జంపన బుజ్జి రాజు, మధు రాజు, అటారం మాస్టారు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల శుభ్రతతోనే స్వచ్ఛభారత్ సాకారం



పినపళ్లలోని గ్రామస్తులకు కిట్లు అందజేస్తున్న ఓఎన్జీసీ అధికారులు

ఆలమూరు: పరిశుభ్రమైన ఇల్లుతో పాటు శుభ్రతో కూడిన పరిసరాలే స్వచ్ఛ భారతానికి ఆభరణాలు అంటూ బుధవారం పినపళ్ళలో ఓఎన్జీసీ స్వచ్ఛ పక్వాడ పక్షోత్సవాలు జరిగాయి. స్థానిక ఓఎన్జీసీ కార్యాలయం సైట్‌లో మేనేజర్ పి.జగన్నాథరావు, సర్పంచ్ సంగిత సుభాష్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ అవగాహన కార్యక్రమం జరిగింది. పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై ఓఎన్జీసీ అధికారులు ఏర్పాటు చేసిన బుర్రకథ గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం గ్రామంలో స్వచ్ఛ భారత్ ఆవశ్యకతను వివరిస్తూ ఓఎన్జీసీ అధికారులు, పంచాయతీరాజ్, ఆరోగ్య అంగన్వాడీ సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంపీటీసీ పెద్దిరెడ్డి పట్టాభి, ఉప సర్పంచ్ యనమదల రాణి, పంచాయతీ కార్యదర్శి ఎస్.వీర్రాజు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ మంత్రి వేణుకు పలువురి పరామర్శ



మంత్రి వేణును పరామర్శిస్తున్న లీలాకృష్ణ, సత్యనారాయణరెడ్డి

రామచంద్రపురం: మాతృవియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను బుధవారం పలువురు పరామర్శించారు. వేగుళ్ల లీలాకృష్ణ, రెడ్డి ప్రసాద్, కేవీవీ సత్యనారాయణరెడ్డి, కొవ్వూరి త్రినాథ్‌రెడ్డి, మోడరన్ విద్యా సంస్థల అధినేత జీవీ రావు, మాజీ ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, పట్టణానికి చెందిన పలువురు వేణు మాతృమూర్తి సుభద్రమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేణు ఆయన కుటుంబీకులకు సంతాపం తెలిపారు. నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు, నాయకులు వేణును పరామర్శించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



ప్రేమ్‌కుమార్ (ఫైల్)

అయినవిల్లి: వీరవల్లిపాలెం గ్రామానికి చెందిన అడపా ప్రేమ్‌కుమార్ (29) మంగళవారం రాత్రి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. తన ఇంట్లో కరెంటు లేక పోవడంతో తన అన్నయ్య ఇంటి నుంచి సరఫరాను తీసుకునేందుకు ఫీజు మారుస్తుండగా విద్యుత్ తీగలు అతడి నోటికి తగిలాయి. దీంతో షాక్‌కు గురైన అతడిని 108లో అమలాపురం తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ప్రేమ్ కుమార్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నాయి. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వి.రాజేష్ కుమార్ తెలిపారు.

మోటారు సైకిలిస్టు మృతి



మణికంఠ

అంబాజీపేట: మాచవరం శివారు భారత్ గ్యాస్ కంపెనీ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటారు సైకిలిస్టు మృతి చెందాడు. అమలాపురం రూరల్ గున్నేపల్లి అగ్రహారానికి చెందిన మట్టా మణికంఠ (31) తన మోటారు సైకిల్‌పై పి.గన్నవరం నుంచి అంబాజీపేట వైపు వస్తున్నాడు. ఈ సమయంలో గ్యాస్ కంపెనీ వద్ద రోడ్డులోని భారీ గోతిలో పడి మోటారు సైకిల్ అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో మణికంఠ మృతి చెందాడు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభకు విరాళాల సేకరణ

రాయవరం: యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవ సభలకు ఆ సంఘ నేతలు ఉపాధ్యాయుల నుంచి విరాళాలు సేకరిస్తున్నారు. ఈ ఏడాది డిసెంబరు 14,15,16,17 తేదీల్లో కాకినాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలు నిర్వహించనున్నారు. రాష్ట్రం మొత్తం నుంచి జిల్లాకు వచ్చే యూటీఎఫ్ కార్యకర్తలకు, అతిథులకు జిల్లా ఆతిథ్యం ఇవ్వనున్న నేపథ్యంలో ఘనంగా ఏర్పాట్లు చేసేందుకు యూటీఎఫ్ మండల శాఖ విరాళాల సేకరణకు నడుం బిగించింది.

యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా శ్రీరామమూర్తి



అంబాజీపేట: స్థానిక యూనియన్ బ్యాంక్ సీనియర్ మేనేజర్‌గా ఎం.వెంకట శ్రీరామమూర్తి నియమితులయ్యారు. బుధవారం ఆయన ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. అయినవిల్లి మండలం తొత్తరమూడి యూనియన్ బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తూ అంబాజీపేట యూనియన్ బ్యాంక్‌కు సీనియర్ మేనేజర్‌గా బదిలీ అయ్యారు. ఇంత వరకు ఇక్కడ మేనేజర్‌గా విధులు నిర్వహించిన ఎంవీ రమణ ఉప్పలగుప్తం యూనియన్ బ్యాంకుకు బదిలీపై వెళ్లారు. శ్రీరామమూర్తి మాట్లాడుతూ సిబ్బంది, ఖాతాదారులు, వ్యాపారస్తులు అందరి సహకారంతో బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు.

మండలంలో 30 శాతం వరి నాట్లు



వరినాట్లు వేస్తున్న కూలీలు

రాయవరం: మండలంలో 30 శాతం మేర ఖరీఫ్ వరి నాట్లు పూర్తయ్యాయి. మండలంలోని 12 గ్రామాల్లో 14,646 ఎకరాల్లో ఖరీఫ్ వరి నాట్లు వేస్తున్నారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో రైతులు వ రినాట్లు వేగవంతం చేస్తున్నారు. వరినాట్లు వేసిన రైతుల్లో 60 శాతం మేర వెదజల్లు విధానంలో సాగు చేస్తుండగా, మిగిలిన 40 శాతం సాధారణ పద్ధతిలో వరినాట్లు వేశారు. సాధారణ పద్ధతిలో వరినాట్లు వేస్తున్న రైతులు బెంగాలీ కూలీలతోనే వరినాట్లు వేయిస్తున్నారు. మండలంలోని రైతుల అవసరాలకు తగినట్టుగా ఎరువులు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ తెలిపారు. ఆర్‌బీకేల్లో 20 టన్నులు డీఏపీ, 18 టన్నులు కాంప్లెక్స్, 81 టన్నుల యూరియా ఉందన్నారు. అలాగే పీఏసీఎస్‌లలో 14 టన్నుల కాంప్లెక్స్, 10 టన్నుల యూరియా, ప్రైవేట్ డీలర్ల వద్ద 206 మెట్రిక్ టన్నుల యూరియా, 18 టన్నుల పొటాష్, 168 టన్నుల కాంప్లెక్స్, 40 టన్నులు సూపర్, 325 టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉందన్నారు. రైతులు సాధ్యమైనంత త్వరగా ఖరీఫ్ వరినాట్లను పూర్తి చేసుకోవాలని, వెదజల్లు విధానానికి ప్రాధాన్యం ఇవ్వాలని, దీని వలన సమయం ఆదా అవుతుందని ఎంఏవో ప్రభాకర్ సూచిస్తున్నారు. వరినాట్లు ఆలస్యమైతే పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యాల బారిన పడే అవకాశముందని, రైతు సోదరులు ఈ విషయాన్ని గమనించాలని ఏవో ప్రభాకర్ సూచిస్తున్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం



అంతర్వేదిలో నిర్వహిస్తున్న స్వామి కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో బుధవారం ఆర్జిత సేవగా స్వామివారి శాంతి కల్యాణం బహుళ ద్వాదశి తిథి నాడు అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం విష్వక్సేన పూజతో అర్చకులు ప్రారంభించారు. వేదమంత్రాలతోను, మంగళవాయిద్యాల నడుమ కనుల పండువగా ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకుడు పెద్దింటి వేంకట శ్రీనివాస్, వేద పండితులు ఈ కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం స్వామి మూలవిరాట్ దర్శనం కల్పించింది. అలాగే లడ్డూ ప్రసాదం ఇచ్చి, అన్నదాన పథకంలో భోజన సౌకర్యం కల్పించింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేయాలి



ఇరుసుమండలో మంచినీటి ట్యాంకును పరిశీలిస్తున్న డీఎల్పీవో బొజ్జిరాజు

అంబాజీపేట: సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ఉన్న వాటర్ ట్యాంకుల ద్వారా శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేయాలని డీఎల్పీవో పి.బొజ్జిరాజు అన్నారు. ఇరుసుమండ, ముక్కామల, పుల్లేటికుర్రు తదితర గ్రామాల్లో బుధవారం ఆయన వాటర్ ట్యాంకులను పరిశీలించారు. డీఎల్పీవో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు శుద్ధి చేసిన తాగునీటిని అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకున్నామన్నారు. దీనిలో భాగంగానే గ్రామాల్లో ఉన్న వాటర్ ట్యాంకులను శుభ్రం చేయడం జరిగిందన్నారు. ప్రతి 15 రోజులకోసారి మంచి నీటి ట్యాంకులను శుభ్రం చేయాలని ఆయా పంచాయతీలకు సూచించామన్నారు. మంచినీటిని సరఫరా చేయడంలో ఎవరూ అలసత్వం వహించవద్దని హెచ్చరించామన్నారు. డీఎల్పీవో వెంట కార్యదర్శి రాయి ఏడుకొండలు చంటి తదితరులు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకోండి

అంబాజీపేట: దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ పొందేందుకు స్లాట్‌ను ప్రభుత్వం విడుదల చేసిందని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ జి.సరోవర్ తెలిపారు. ఈ ఏడాది జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించి సదరం సర్టిఫికెట్ పొందేందుకు ఈ నెల 4 నుంచి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన వారు ఆయా గ్రామాల్లో ఉన్న సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.